# రోథము

(సాహితి "మాసపత్రిక" రుధిరోద్గారి - ఆశ్వయుజము - అక్టోబర్ 1923)

**సా**యంవేళా ప్రశీతల మందమరుత్తరంగములచే కృష్ణవేణికి పుల్కలైనవి. విజయవాటి కాంతర్దుర్గంధ మెడగా స్వచ్ఛ వాయువులు పీల్చుటకు వచ్చిన జనులు బారులుగా నానకట్ట మొదలి వంతెన యొద్ద నెత్తుగోడమీద కూర్చుండిరి.

అత డభ్యంగ మాచరించి తన మిత్రులు కొందఱితో వచ్చి యచట గూర్చుండి యేదో ప్రసంగమున నున్నాడు. ఆ చల్లని గాలిలో నతని విరియబోసిన తలవెంద్రుకలు పొడిపొడిగా నుండి జవ్వాది పొగచేత పిహితములైనట్లు గుమగుమ లాడినవి. మొగమున చుక్కబొట్టు నెమలికన్నులలోని నీలికాంతులకు నెలవా?

ఒక బిచ్చపుది. ప్రౌఢవయఃపరిపాక. మేని చినుగు పుట్ట ముదికి యెన్నేండ్లైనదో! డబ్బులడుగుకొను చున్నది. ఇచ్చినవారిచ్చిరి. లేనివారు లేదన్నారు. ఆమె దీపములైన కనులతో నతనికడకు వచ్చినది. అతడు కనులెత్తి చూచినాడు. ఇద్దరి చూపులు కలిసినవి. ఆమె వదనాంత మనోజ్ఞ రేఖాంతరమ్ముల మన్మథుడు నివాసమున్నాడు. ఆ కనులయందము రతికి తలవంపు.

ఒక చల్లనిగాలి కెరటము వచ్చినది. ఆమె మాలిన్య సీమయైన వదనాంచలము మిసమిసలాడినది. అతడు ముగ్ధుడైపోయినాడు. జేబులో నున్న రూపాయి తీసి యియ్యబోయిన యాతని దాతృత్వ మామె యంగీకరించలేదు. పుచ్చుకొనకుండ పోవుచున్న యాయమ యవయవచాలనంబున క్రుద్ధయైన ప్రణయినీ స్వరూపము గోచరమైనది...

కృష్ణాస్రవంతిక యానకట్ట వఱకు లంక పేర్చుచున్నది. ఆనకట్ట నిరుపయోగ మగునేమో కొన్నాళ్ళకని కొందరికి భయము.